సాక్షి
పల్నాడు
శనివారం, 15, ఫిబ్రవరి, 2025



వీరమ్మతల్లీ.. మముబ్రోవుమా

ఉయ్యూరు: వీరమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవం శుక్రవారం ఏడో రోజుకు చేరింది. తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి చల్లని తల్లిని దర్శించుకుని తరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 540 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,633 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



చాగంటివారిపాలెం (ముప్పాళ్ల): చాగంటి వారి పాలెంలోని సుభద్ర బలభద్ర సహిత జగన్నాథ స్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

న్యూస్‌రీల్

ముగిసిన గంగాదేవి తిరునాళ్ల



అచ్చంపేట: ఓర్వకల్లులో గత మూడు రోజులుగా జరుగుతున్న స్వయంభు గంగాదేవి పేరంటాళమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. అమ్మవారి హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను దేవదాయశాఖ, ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో లెక్కించారు. హుండీ ఆదాయం రూ.5,05,497 రాగా, అమ్మవారి దర్శన టిక్కెట్ల రూపంలో రూ.74,340 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.కోటేశ్వరరావు తెలిపారు. ఆలయం వద్ద దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు నెమలికల్లుకు చెందిన తుమ్మా నరేంద్రరెడ్డి పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. రుద్రవరం గ్రామస్తులు అమ్మవారి ఉత్సవాలకు గంగమ్మతల్లి ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ సత్తెనపల్లి డివిజన్ ఇన్‌స్పెక్టర్ వి.లీలావతి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు శివరాత్రి ఉత్సవాలపై సమీక్ష

అమర్తలూరు: మహాశివరాత్రి తిరునాళ్ల విజయవంతం చేసేందుకు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని గోవాడ బాల కోటేశ్వర స్వామి దేవస్థానం కార్య నిర్వహణాధికారి అశోక్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోవాడ బాలకోటేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం ఉదయం 11 గంటలకు రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారి రామలక్ష్మి సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

గుంటూరు డీవైఈవోగా ఏసురత్నం



గుంటూరు ఎడ్యుకేషన్ : గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారిగా నియమితులైన సీనియర్ ఎంఈవో జి. ఏసురత్నంకు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక అభినందనలు తెలియజేశారు. శుక్రవారం డీఈవో కార్యాలయంలో గుంటూరు డీవైఈవోగా పూర్తి అదనపు బాధ్యతల (ఎఫ్ఏసీ)పై నియమితులైన జి. ఏసురత్నం డీఈవో రేణుకను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ఏ.తిరుమలేష్, ఎంఈవో అబ్దుల్ ఖుద్దూస్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం పాల్గొన్నారు.

చిరుమామిళ్లలో ఆలయాల వార్షికోత్సవం



నాదెండ్ల: చిరుమామిళ్ళ గ్రామంలోని కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, శివాలయం వార్షికోత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఎస్టీ కాలనీలోని శివాలయం, నాదెండ్ల డొంకరోడ్డులోని కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాలను 2019లో గ్రామానికి చెందిన విద్యాదాత నడికట్టు రామిరెడ్డి తన సొంత నిధులతో నిర్మించారు. ప్రత్యేక పూజల్లో నడికట్టు రామిరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అన్నదానం నిర్వహించారు. ఆయన వెంట కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు సిరిపురపు అప్పారావు, గ్రామస్తులు యన్నం శివారెడ్డి, మద్దూరి భాస్కరరెడ్డి, అప్పిరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, మిట్టపాలెపు వెంకటేశ్వరరావు, భవనం శ్రీనివాసరెడ్డి, కమ్మ సీతయ్య, నర్రా శ్రీనివాసరావు, వీరారెడ్డి పాల్గొన్నారు.

రూ.50 వేలు మించి నగదు ఉండరాదు

లక్ష్మీపురం: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల నియోజకవర్గ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా నియమావళి అమలులో ఉందని, తగిన ఆధారం లేకుండా రూ.50 వేలకు మించి ఎవరూ నగదు కలిగి ఉండరాదని సహాయ రిటర్నింగ్ అధికారి, డీఆర్ఎం షేక్ ఖాజావలి శనివారం తెలిపారు. నిబంధనలు పాటించకుంటే నగదును జప్తు చేస్తామని పేర్కొన్నారు.

నిండా ముంచేశాడు.. ఆదుకోండయ్యా...

జిల్లా ఎస్పీని కలిసిన సాయి సాధన చిట్‌ఫండ్ బాధితులు

పుల్లారావు ఆస్తిపాస్తులు జప్తుతో న్యాయం చేయాలని వేడుకోలు



నరసరావుపేట టౌన్: కుటుంబ అవసరాలకు ఆదుకుంటాయని పొదుపు చేసిన డబ్బులతో ఉడాయించాడు... మీరే ఎలాగైనా న్యాయం చేయాలంటూ సాయి సాధన చిట్‌ఫండ్ బాధితులు శుక్రవారం పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావును కలిసి గోడు వెళ్లబోసుకున్నారు. ప్రజల నుంచి రూ.వందల కోట్లను చీటీలు, అప్పుల రూపంలో సేకరించిన పుల్లారావు ఆ మొత్తాన్ని దారి మళ్లించాడన్నారు. చివరకు సబ్‌జైల్లో కూర్చొని వ్యాపారంలో నష్టం వచ్చినట్లుగా చెబుతూ అందరికీ ఎగ్గొట్టాలన్న ప్రయత్నాల్లో ఉన్నాడని పేర్కొన్నారు. గత నాలుగు నెలల్లో సుమారు రూ.70 కోట్ల వరకు అప్పుగా తీసుకొని వాటితో ఆస్తులు, బంగారం కొన్నాడని తెలిపారు. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిందితుడు పాలడుగు పుల్లారావు దోచుకున్న సొమ్మును రికవరీ చేసి అందరికీ పంచాలన్నారు. పుల్లారావు కుటుంబ సభ్యులు విదేశాలకు పారిపోయేందుకు ప్రయత్నిస్తున్నారని, వెంటనే వారిని అరెస్ట్ చేయాలని కోరారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, త్వరలోనే నిందితులను పట్టుకొని అందరికీ న్యాయం జరిగేలా చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు.

పుల్లారావు భాగస్వాముల కోసం గాలింపు..

ములకలూరు గ్రామం వద్ద విజయలక్ష్మి టౌన్‌షిప్ మెగా వెంచర్‌ను పాలడుగు పుల్లారావు భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ టౌన్‌షిప్‌లో రూ.11.62 కోట్లు పెట్టుబడి పెట్టగా.. అందులో భాగస్వామ్యం ఇవ్వకుండా మోసం చేశారని దండా రాజ్యలక్ష్మి ఇటీవల గుంటూరు పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదుతో పుల్లారావుతోపాటు టౌన్‌షిప్‌లో భాగస్వామి అయిన గుండా సాంబశివరావుపై చీటింగ్ కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటికే పుల్లారావు కోర్టులో లొంగిపోయి సబ్‌జైల్లో ఉన్నాడు. గుండా సాంబశివరావు కోసం పట్టాభిపురం పోలీసులు అతని ఇంటికి చేరుకున్నారు. అక్కడ లేకపోవటంతో సత్తెనపల్లి రోడ్డులోని టౌన్‌షిప్ కార్యాలయానికి వెళ్లారు.

కేసు సీఐడీకి బదిలీ.. ?

పాలడుగు పుల్లారావుపై నమోదైన చిట్‌ఫండ్ స్కాం కేసు సీబీసీఐడీకి బదిలీ చేయనున్నట్లు సమాచారం. నష్టపోయిన బాధితులు గత వారం రోజులుగా డీఎస్పీ కార్యాలయానికి వెళ్లి ఆధారాలు అందజేస్తున్నారు. ఇప్పటికే సుమారు 200 మంది వరకు తాము కట్టిన చీటీపాట రశీదులను అందించారు. చిట్‌ఫండ్, ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో రూ.2.70 కోట్లు కట్టించుకొని మోసం చేశాడని మాజీ కౌన్సిలర్ వేలూరి సుబ్బారెడ్డి ఫిర్యాదుతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. రోజురోజుకు బాధితుల సంఖ్య పెరగటంతో పాటు పుల్లారావు కాజేసిన సొమ్ము రూ.వందల కోట్లకు చేరింది. సుమారు 800 మంది బాధితుల నుంచి రూ.300 కోట్లకుపైగానే పుల్లారావు మోసం చేశాడని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. కేసు ప్రాధాన్యతను బట్టి సీఐడీకి అప్పగించాలని ఉన్నతాధికారులకు స్థానిక పోలీస్ అధికారులు నివేదించినట్లు తెలియ వచ్చింది. త్వరలో దీనిపై అధికారిక ప్రకటన రానుంది. కేసు సీఐడీకి బదిలీ చేయనున్నట్లు తెలుసుకున్న బాధితులు ఆందోళన చెందుతున్నారు. కేసు పరిష్కారంలో అలసత్వం చోటు చేసుకుంటుందని చర్చించుకుంటున్నారు.



నరసరావుపేట కమ్మ హాస్టల్‌లో సమావేశమైన పుల్లారావు బాధితులు (ఫైల్)

ఎమ్మెల్సీ ఓటర్లకు 90 పోలింగ్ స్టేషన్లు



మాట్లాడుతున్న కలెక్టర్ పి.అరుణ్‌బాబు

- మొత్తం ఓటర్లు 56,964 మంది
- ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.అరుణ్‌బాబు

నరసరావుపేట: ఈనెల 27న జరగనున్న కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పల్నాడు జిల్లాలో 38 ప్రాంతాలలో మొత్తం 90 పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని గుర్రం జాషువా సమావేశ మందిరంలో మండల అభివృద్ధి అధికారులకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై నిర్వహించిన శిక్షణ తరగతులలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

- జిల్లాలో మొత్తం 56,964 మంది పట్టభద్రులు ఓటుహక్కు కలిగి ఉన్నారు. వారిలో 37,832 మంది పురుషులు, 19,129 మంది మహిళలు, ముగ్గురు ట్రాన్స్‌జెండర్స్ ఉన్నారని తెలిపారు.
- అంతా ఓటుహక్కు సజావుగా వినియోగించుకునేందుకు అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.
- ప్రిసైడింగ్ అధికారులు 108 మంది, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు 108 మంది, ఓ.పి.ఓ.లు 216 మంది, సూక్ష్మ పరిశీలకులుగా 46 మందిని నియమించినట్లు తెలిపారు.
- పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు ఐదు రకాల టీములు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.
- ఎం.సి.సి., ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వైలెన్స్ టీములు 36 చొప్పున, ఏడు వీడియో సర్వైలెన్స్ టీంలు, 17 మందిని సెక్టార్ ఆఫీసర్స్ రూట్ అధికారులుగా నియమించడం జరిగిందని పేర్కొన్నారు.
- ముగ్గురు మాస్టర్ ట్రైనర్లు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై శిక్షణ ఇస్తున్నారని, మండల అధికారులు ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లా రెవెన్యూ అధికారి ఏకా మురళి, రెవెన్యూ డివిజినల్ అధికారులు మధులత, రమాకాంత్ రెడ్డి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

యార్డులో లక్షకుపైగా మిర్చి బస్తాల విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 91,613 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,00,564 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.9,000 నుంచి రూ.14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,900 వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం రూ.10,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.10,000 నుంచి రూ.11,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 48,224 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

భక్తులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు

- ప్రభుత్వ రెవెన్యూ(దేవదాయ) కార్యదర్శి వినయ్‌చంద్
- కోటప్పకొండలో తిరునాళ్ల ఏర్పాట్లు పరిశీలన



కోటప్పకొండలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న వినయ్‌చంద్

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంత వాతావరణంలో దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ (దేవదాయ) సెక్రటరీ వినయ్‌చంద్ అన్నారు. కోటప్పకొండను శుక్రవారం ఆయన సందర్శించి త్రికోటేశ్వర స్వామిని దర్శించుకొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో చేపడుతున్న తిరునాళ్ల ఏర్పాట్లను ఆలయ అధికారులతో కలిసి పరిశీలించారు. క్యూలైన్‌లు, ప్రసాదం తయారీ పోటులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు క్యూలైన్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సామాన్య భక్తులు కూడా స్వామివారిని ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా క్యూలైన్ నిర్వహణ ఉండాలన్నారు. భక్తులకు అందజేసే ప్రసాదాలు సరిపడా సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రసాదాలు అందలేదనే మాట భక్తుల నుంచి రాకూడదని, ఇందుకు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. తిరునాళ్ల విధుల్లో నిర్లక్ష్యం వహించినా, అవాంఛనీయ ఘటనలు జరిగినా సంబంధిత అధికారులపై కఠినచర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో డి.చంద్రశేఖరరావు, ఆర్‌డీవో మధులత, డీఎంహెచ్‌వో రవి, డీపీవో విజయభాస్కరరెడ్డి, తహసీల్దార్ వేణుగోపాల్, మద్దమంచిపాడు ఆలయ ఈవో సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భావనాఋషి పెళ్లి కుమారుడి ఉత్సవం

రేపు కళ్యాణ మహోత్సవం



పెండ్లి కుమారుడి ఉత్సవంలో భావనాఋషి స్వామి వారు

మంగళగిరి: పాత మంగళగిరి భావనాఋషి స్వామి వారి పెళ్లి కుమారుడి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని పెండ్లి కుమారుడిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి ఉత్సవాన్ని తిలకించారు. ఉదయం స్వామి వారి మూలవిరాట్లకు అభిషేకం నిర్వహించి భావనాఋషి స్వామి, శ్రీ భద్రావతి దేవి వార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా పురోహితులు వేదమంత్రాల మధ్య అలంకరించారు. ఉత్సవ కైంకర్యపరులుగా డాక్టర్ తాడిపర్తి మురళి వెంకటేశ్వరరావు, విజయభారతి, డాక్టర్ తాడిపర్తి శ్రీనివాసమూర్తి దంపతులు పూజలు నిర్వహించారు. శనివారం స్వామి వారి కళ్యాణ మహోత్సవం నిర్వహించడం జరుగుతుందని, ఈ సందర్భంగా రాజీవ్ సెంటర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు , బాణసంచా కాల్పులు, కళాకారుల నృత్యాలు నిర్వహించబడతాయన్నారు.

కార్యక్రమంలో పద్మశాలీయ బహుత్తమ సంఘ ప్రతినిధులు చింతికింది కనకయ్య, గుత్తికొండ ధనుంజయరావు, దామర్ల కుబేరస్వామి, గంజి రవీంద్ర నాథ్, రామనాథం పూర్ణచంద్రరావు, మునగపాటి వెంకటేశ్వరరావు, వంగర లక్ష్మయ్య, జంజనం భిక్షారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో బర్డ్‌ఫ్లూ లేదు

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కాంతారావు

నరసరావుపేట రూరల్: జిల్లాలో బర్డ్‌ఫ్లూ లక్షణాలు కనిపించడం లేదని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.కాంతారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోళ్ల ఫారాలను పశు సంవర్ధక శాఖ సిబ్బంది సందర్శించి సంబంధిత యజమానులకు బయో సేఫ్టీ, బయో సెక్యూరిటీ విధానాలపై అవగాహన కల్పించినట్టు పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటికే 28 ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇతర రాష్ట్రాల నుంచి కోళ్ల రవాణా విషయంలో చెక్‌పోస్ట్ సిబ్బందిని అప్రమత్తం చేసినట్టు తెలిపారు. కోడి మాంసం, గుడ్లు తీసుకున్నా ప్రజల ఆరోగ్యానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. అధిక ఉష్ణోగ్రతలో ఈ వైరస్ బతకలేదని తెలిపారు. కోడిమాంసం, గుడ్లు 100 డిగ్రీల ఉష్ణోగ్రతతో ఉడికిస్తామని, దాని వలన ఎలాంటి వైరస్ ప్రభావం ఉండదని తెలిపారు. ప్రజలు ఎలాంటి అపోహలకు పోకుండా కోడిమాంసం, గుడ్లను తీసుకోవచ్చని సూచించారు. కోళ్ల ఫారాల నిర్వాహకులు ఈ వైరస్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వైరస్ దరిచేరకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలన్నారు. వ్యాధి లక్షణాలను గుర్తిస్తే పశువైద్య సిబ్బంది సలహాలు తీసుకోవాలని సూచించారు.

పార్ట్ టైం.. ఫుల్ చీటింగ్!

పార్ట్ టైం ఉద్యోగాల పేరుతో సైబర్ నేరస్తులు నిండా ముంచుతున్నారు. నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకుని ఆశల వల విసిరి పెద్దమొత్తంలో కొల్లగొడుతున్నారు. పలు కోణాల్లో ప్రజలను టార్గెట్ చేస్తూ బ్యాంకు ఖాతాల్లో నగదు దోచేస్తున్నారు. రోజుకో సైబర్ నేరం జరుగుతున్నా చాలామంది అవగాహన పెంచుకోవడం లేదు.



- ఉద్యోగాల పేరుతో సైబర్ నేరగాళ్ల వల
- లింక్‌లపై క్లిక్ చేస్తే అంతే సంగతులు
- వివిధ చార్జీల నెపంతో డబ్బు వసూలు
- బాధితుల్లో ఉన్నత విద్యావంతులే అధికం

పట్నంబజారు ఇంటి వద్దే పని అని చెప్పడంతో చాలామంది వెంటనే లింకులు క్లిక్ చేసి బోల్తా పడుతున్నారు. రిజిస్ట్రేషన్ చార్జీలు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ చార్జీలు, అడ్వాన్స్, సెక్యూరిటీ డిపాజిట్ వంటి పేర్లతో విడతల వారీగా ఖాతాలను సైబర్ నేరగాళ్లు ఖాళీ చేస్తున్నారు. లింకులపై క్లిక్ చేశాక ఫోనులోని ఫొటోలు సేకరించిన సైబర్ దుండగులు మార్ఫింగ్ చేసి.. బ్లాక్ మెయిల్‌కు దిగుతున్న పరిస్థితులు ఉన్నాయి. ఇటీవల గుంటూరు లాలాపేట పోలీసుస్టేషన్ పరిధిలో ఒక మహిళకు కూడా ఓ దరఖాస్తు పంపిన దుండగులు అన్నిరకాలుగా ఫోన్‌లో అనుమతులు కోరారు. ఆమె ఇవ్వడంతో పాటు ఫొటోలను అప్‌లోడ్ చేశారు. రోజుల వ్యవధిలోనే బెదిరింపులకు దిగి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆమె చెల్లించకపోవటంతో మార్ఫింగ్ ఫొటోలతో వేధించారు.

విడతలవారీగా లాగేశారు..

పాత గుంటూరుకు చెందిన ఒక నిరుద్యోగి 'పార్ట్ టైం ఉద్యోగం' పేరుతో వచ్చిన ఆన్‌లైన్ లింక్ క్లిక్ చేశాడు. ఫార్మాలిటీ ప్రకారం అని తొలుత రూ.3 వేలు అడగటంతో కట్టాడు. తర్వాత ఈ చలానా.. ఆ ఫీజు అని చెప్పి సుమారుగా రూ.80 వేల వరకు దుండగులు లాగేశారు. నెల రోజుల పాటు ఈ తంతు సాగింది. అప్రూవల్ వస్తుందని.. రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్ అంటూ పలు కారణాలతో డబ్బులు తీసుకున్నారు. ఆ తర్వాత ఉద్యోగం మాత్రం రాలేదు. వారి సెల్‌ఫోన్ నెంబర్లు స్విచ్ఛాఫ్ అయ్యాయి. అప్పటికిగానీ మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించారు.

- బ్రాడీపేటకు చెందిన ఒక బీటెక్ విద్యార్థిని సామాజిక మాధ్యమాల ద్వారా ఉద్యోగ అవకాశాల కోసం వెతికారు. సైబర్ నేరగాళ్లు వల విసిరారు. వారికి ఫొటోలు, మార్కుల జాబితాలు పంపింది. ఆ తర్వాత రూ.20 వేలు అడ్వాన్స్ కూడా ఇచ్చింది. ఉద్యోగం ఇస్తున్నట్లు నమ్మించారు. రెండు నెలలపాటు రూ.10 వేలు చొప్పున జీతం ఇచ్చారు. ఆ తర్వాత ప్రమోషన్ ఇస్తామని రూ.50 వేలు కట్టించుకుని మోసగించారు.

అప్రమత్తత అవసరం



సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే ఉద్యోగ ప్రకటనలు చూసి ఎవరూ మోసపోవద్దు. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో పార్ట్ టైం ఉద్యోగాల పేరుతో ఎక్కువగా మోసాలు జరుగుతున్నాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ లింక్‌లపై క్లిక్ చేయకూడదు. చదువుకున్న వారే ఎక్కువగా మోసపోతున్నట్లు మా దృష్టికి వచ్చింది. అప్రమత్తత చాలా అవసరం. ఉద్యోగ ప్రకటనలు, రీచార్జి ఆఫర్లు తదితర వాటిని ఎవరూ నమ్మొద్దు.

– ఎస్. సతీష్‌కుమార్, ఎస్పీ, గుంటూరు

వివక్షపై న్యాయ విద్యార్థుల ఆవేదన

- ఏఎన్‌యూలో విభాగాధిపతి మార్పునకు డిమాండ్
- లేదంటే తమకు టీసీలిచ్చి పంపించాలని వేడుకోలు
- ఆందోళనకు దిగిన విద్యార్థులతో రిజిస్ట్రార్ చర్చలు
- సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ



విద్యార్థులతో చర్చిస్తున్న రిజిస్ట్రార్ సింహాచలం

పెదకాకాని: వివక్షతో న్యాయ శాస్త్రం విభాగాధిపతి, కొందరు ఆచార్యులు తమను మొదటి ఇంటర్నల్ పరీక్షలు రాయనివ్వలేదని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఎల్ఎల్ఎం ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం న్యాయ శాస్త్ర విభాగానికి వెళ్లి విద్యార్థులతో, ఆచార్యులతో చర్చించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ హాజరు సరిపోలేదని కొన్ని సామాజిక వర్గాల విద్యార్థులను విభాగాధిపతి పరీక్షలకు అనుమతించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకంటే తక్కువ రోజులు క్లాసులకు వచ్చిన వారిని పరీక్షలకు అనుమతించారని, ఇదేంటని ప్రశ్నించారు. వివక్ష రోజురోజుకు పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విభాగాధిపతి, కొందరు ఆచార్యుల వేధింపులు తట్టుకోలేక పలువురు విద్యార్థులు టీసీలు సైతం తీసుకొని అర్ధాంతరంగా వెళ్లిపోయారని తెలిపారు. ఈ వైఖరి సరికాదని, దీనిపై విచారణ జరపాలని కోరారు. గత సంవత్సరం కూడా హాజరు సరిపోలేదని 11 మంది విద్యార్థులను పరీక్షలు రాయనివ్వలేదని, వారిలో ఎక్కువ శాతం అణగారిన సామాజిక వర్గాల వారే ఉన్నారని గుర్తుచేశారు. దీనిని వర్సిటీ ఉన్నతాధికారులు పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ విభాగంలో ఓ ఆచార్యుడు సుదీర్ఘకాలం సెలవు పెట్టి తరగతులకు రాకపోయినా హాజరైనట్లు చూపించారని, అతడే కొందరు విద్యార్థులకు హాజరు లేకపోయినా పరీక్షలు అనుమతించారని తెలిపారు. ఇలాంటి కార్యకలాపాలు వివక్షతోనే జరుగుతున్నాయని మండిపడ్డారు. మరికొందరు విద్యార్థులు మాట్లాడుతూ కిషోర్ అనే ఆచార్యుడు గోల్డ్ మెడల్ సాధించిన వ్యక్తి అని, ఎంతో ప్రతిభ కలిగిన ఆయన అర్ధాంతరంగా సెలవు పెట్టి వెళ్లిపోవటం వల్ల విద్యార్థులకు నష్టం జరుగుతోందని, దీని వెనక కొన్ని వర్గాల కుట్ర ఉందని ఆరోపించారు. అన్ని విషయాలు విన్న రిజిస్ట్రార్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎవరు వివాదాలకు దిగవద్దని ఆదేశించారు. కొందరు అతిథి ఆచార్యులు మాట్లాడుతూ తమ విషయంలో కూడా విభాగాధిపతి వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. తమను అవమానకరంగా చూస్తున్నట్లు తెలిపారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని కూడా వారు స్పష్టం చేశారు. తరగతులకు నిత్యం హాజరుగాని ఓ వర్గం విద్యార్థికి హాజరు వేసి ప్రథమ ఇంటర్నల్ పరీక్ష రాయించిన ఓ అతిథి ఆచార్యుడు వివాదాన్ని ముందుగానే ఊహించి తన ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు సమాచారం.

క్లుప్తంగా

సత్రశాలలో మహాశివరాత్రికి పకడ్బందీ ఏర్పాట్లు

దేవదాయశాఖ డెప్యూటీ కమిషనర్ బసవ శ్రీనివాసరావు



ఈఓ గాదె రామిరెడ్డితో మాట్లాడుతున్న బసవ శ్రీనివాసరావు

సత్రశాల(రెంటచింతల): మహాశివ రాత్రి పర్వదినం పురస్కరించుకుని ఫిబ్రవరి 26న సత్రశాల గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని దర్శించుకునే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన సేవలు అందించాలని గుంటూరు దేవదాయశాఖ డెప్యూటీ కమిషనర్ కామినేని బసవ శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం స్థానిక దేవస్థానం ప్రాంగణంలో ఆయన ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డితో కలిసి మహాశివరాత్రి ఏర్పాట్లపై చర్చించి సూచనలు చేశారు. సత్రశాల వరకు ఉన్న రహదారికి ఇరువైపులా ఉన్న గుంతలను వెంటనే పూడ్చే పనులు చేపట్టాలని ఆదేశించారు. ముందుగా ఆయన దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట అర్చకులు మల్లికార్జునశర్మ నీలం మల్లయ్య, మున్నా లింగయ్య తదితరులు ఉన్నారు.

పెండింగ్ కేసులు త్వరగా దర్యాప్తు చేయాలి

డీఎస్పీ రామాంజనేయులు

చందోలు(కర్లపాలెం): పెండింగ్ కేసులు త్వరగా దర్యాప్తు చేసి పరిష్కరించాలని బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు ఆదేశించారు. చందోలు పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం డీఎస్పీ రామాంజనేయులు ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు తనిఖీ చేసి పెండింగ్ కేసుల పరిష్కరించేందుకు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ద్విచక్ర మోటారు వాహనాలపై ప్రయాణించే వారు హెల్మెట్ పెట్టుకునే విధంగా కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు పెట్టుకునే విధంగా సిబ్బంది అవగాహన కల్పించాలని చెప్పారు. మండలంలో కోడి పందేలు, పేకాటలపై నిఘా ఉంచాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఆర్.స్వామి శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

ఆలోచింపచేసిన నాటికలు

రంగస్థలి నాటిక పోటీలు ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కంజుల విశాలాక్షి, రంగస్థలి ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత సంస్కృతి సమితి, నరసరావుపేట రంగస్థలి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ప్రకాష్‌నగర్‌లోని భువన చంద్ర టౌన్‌హాల్‌లో 24వ జాతీయస్థాయి ఆహ్వాన తెలుగు నాటిక పోటీలు ప్రారంభమయ్యాయి. రంగస్థలి శాశ్వత సభ్యురాలు కంజుల విశాలాక్షి జగన్మోహనరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేయగా, బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్ పోటీలను ప్రారంభించారు. పోటీలలో తొలిరోజు గుంటూరు అభినయ ఆర్ట్స్ వారి ఇంద్రప్రస్థం, కొప్పోలు పండు క్రియేషన్స్ వారి పక్కింటి మొగుడు నాటికలు ప్రదర్శించారు.

ప్రేమ గొప్పదే.. కానీ..

సృష్టిలో ప్రేమ గొప్పదే.. కానీ ప్రేమలు హర్షించే విధంగా ఉండాలని, జీవితాలు నాశనం అయ్యేలా ఉండకూడదని చెప్పే కథాంశంతో ఇంద్రప్రస్థం నాటికను ప్రదర్శించారు. ఆదర్శాలు కలిగిన వ్యక్తి తన కుమారుడు ప్రేమించాడని తొందరపడకుండా తన ఇంటితో పాటు అమ్మాయి తండ్రికి అండగా నిలబడుతూ ఇరువురి గృహాలను ఇంద్రప్రస్థంలా వెలిగేలా తీర్చిదిద్దటం ఆలోచింప చేసింది.



ఇంద్రప్రస్థం నాటికలోని దృశ్యం

అతిగా ఆశ పడకూడదు..

అతిగా ఆశ పడితే అనర్థాలు తప్పవనీ తెలిచేసే ఇతివృత్తంతో ప్రదర్శించిన పక్కింటి మొగుడు నాటిక ప్రేక్షకులకు ఆనందాన్ని పంచటంతో పాటు ఆలోచింప చేసింది. ఆస్తి కోసం తన భర్తను పక్కింటిలోని స్నేహితురాలి భర్తగా చేసి ఆడిన నాటకం ఆనందాన్ని ఇస్తే, బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డ లాయర్‌కు బుద్ధి చెప్పటం ఆలోచింప చేసింది.

కృష్ణానదిలో గుర్తుతెలియని మృతదేహం



తాడేపల్లిరూరల్: ప్రకాశం బ్యారేజ్ సమీపంలో కృష్ణా నది దిగువ ప్రాంతంలోని గేట్ల వద్ద నీటిలో మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానిక మత్స్యకారులు తాడేపల్లి పోలీసులకు శుక్రవారం సమాచారం ఇచ్చారు. ఎస్‌ఐ జె. శ్రీనివాసరావు ఘటనా స్థలానికి వెళ్లి నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని బయటకు తీయించి పరిశీలించారు. అతడి వద్ద గుర్తించేందుకు ఎటువంటి ఆధారాలు లభించలేదు. ఎస్‌ఐ మాట్లాడుతూ సుమారు 27 నుంచి 32 సంవత్సరాల మధ్య వయసు ఉండవచ్చని, మృతుడి ఒంటిపై ఖాకీ ఫ్యాంట్ షాట్, వైలెట్ కలర్ ఫుల్‌హ్యాండ్స్ టీషర్ట్, మాసిన గడ్డం ఉందని, బహుశా ఇతను ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నామని చెప్పారు. ఎవరైనా ఈ మృతదేహాన్ని గుర్తిస్తే 086452721865కు ఫోన్ చేయాలని కోరారు.

అప్పులబాధతో రైతు ఆత్మహత్య

గుంటూరు రూరల్: అప్పులబాధతో పురుగుల మందుతాగి రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం వంగిపురంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన వరగాని బాబూరావు(60) వ్యవసాయం చేస్తున్నాడు. అతడి భార్య స్థానిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంటపని చేస్తుండేది. వీరికి ఇద్దరు మగ, ఒక ఆడపిల్ల ఉంది. ముగ్గురికి వివాహాలు జరిపించారు. బాబూరావు తనకున్న 40 సెంట్ల భూమితో పాటు మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని అందులో పత్తి, మిరప పంటలు సాగు చేస్తున్నాడు. పంటలకు మద్దతు ధరలు లేక, పంటలు నష్టపోవటంతో అప్పులపాలయ్యాడు. దీంతో ఈనెల 13వ తేదీన తన చిన్నకుమారుడు రాజుకు ఫోన్‌చేసి తాను వ్యవసాయం వలన నష్టపోయి అప్పులపాలయ్యానని, అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురై తమ పొలంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడుతున్నానని ఫోన్‌చేసి చెప్పాడు. బంధువులతో కలిసి పొలంవద్దకు వెళ్లి చూడగా అప్పటికే పురుగుల మందుతాగి అపస్మారక స్థితిలో ఉండటంతో వెంటనే 108లో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఘటనపై ప్రత్తిపాడు పోలీసులు.. మృతుని కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించాలని బ్యాంకు ఉద్యోగుల ధర్నా



ధర్నా చేస్తున్న బ్యాంకు యూనియన్ నేతలు

24 నుంచి బ్యాంకుల సమ్మెకు నేతల పిలుపు

కొరిటెపాడు: ఈనెల 24 నుంచి 25వ తేదీ వరకు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్స్(యూఎఫ్‌బీయూ) తరఫున బ్యాంకుల సమ్మెకు పిలుపునిచ్చినట్లు ఎస్‌బీఐ స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ గుంటూరు మాడ్యూల్ డెప్యూటీ జనరల్ సెక్రటరీ కె.కోటిరెడ్డి తెలిపారు. సమ్మె సందర్భంగా దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన సెంటర్లు, జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో శుక్రవారం నిర్వహించిన నిరసనలో బ్యాంకు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎస్‌బీఐ గుంటూరు మెయిన్ బ్రాంచి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూ తమ డిమాండ్‌లు బ్యాంకులోని అన్ని విభాగాలలో తగిన రిక్రూట్మెంట్, వారానికి ఐదు రోజుల పనిదినాలు ఉన్నాయని చెప్పారు. ఈ క్రమంలోనే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో వర్క్‌మెన్, ఆఫీసర్ డైరెక్టర్ల పోస్టుల భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో గుంటూరు మాడ్యూల్ ఎస్.బి.ఐ. ఆఫీసర్స్ అసోసియేషన్ చీఫ్ రీజినల్ సెక్రటరీ కె.ఆర్.వి.జయ కుమార్, యు.ఎఫ్.బి.యు. అడ్వైజర్ పి.కిషోర్, ప్రెసిడెంట్ ఇ.రవిచంద్రారెడ్డి, జిల్లా సెక్రటరీ మహమ్మద్ సయ్యద్‌బాషా, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆఫీసర్స్ సెక్రటరీ ఎం.రాంబాబు, బెఫీ స్టేట్ ప్రెసిడెంట్ ఎం.సాంబశివరావు పాల్గొన్నారు.

మా భూములు చూపించండి సారూ



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అర్వపల్లి కుటుంబీకులు

సంతమాగులూరు (అద్దంకి): తమకు పూర్వార్జితంగా సంక్రమించిన భూమిని చూపాలని కోరుతూ గ్రామానికి చెందిన అర్వపల్లి కుటుంబీకులు శుక్రవారం సంతమాగులూరు మండల తహసీల్దార్ రవిబాబుకు వినతిపత్రం అందజేశారు. సంతమాగులూరు మండలంలో భూ రికార్డులు సక్రమంగా లేకపోవడంతో ఆక్రమణదారులు పెచ్చుమీరుతున్నారు. ఇతరుల భూమిని సైతం తప్పుడు రికార్డులు సృష్టించి తమ పేరుతో ఆన్‌లైన్ చేయించుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో సర్వే నంబరు 171/1లో తమకు పూర్వార్జితంగా సక్రమించిన 3.50 ఎకరాల భూమి తమ పేరుతో లేకుండా పోయిందని సంతమాగులూరులోని అర్వపల్లి ఇంటిపేరు కలిగిలిన అర్వపల్లి రత్నారావు, వెంకటనారాయణ, పిచ్చయ్య, రామారావు, శ్రీనివాసరావు తదితరులు వాపోయారు. తమ రికార్డుల ప్రకారం సర్వే చేయించి భూమిని ఎవరు ఆక్రమించారో గుర్తించి ఆన్‌లైన్ చేయాలని.. తమకు ఆ భూమి ఎలా తమకు సక్రమించిందో చూపే పత్రాలను తహసీల్దార్‌కు అందజేశారు. తహీల్దారు విచారణలో ఈ సర్వే నంబరుకు సంబంధించి ఆర్ఎస్ఆర్ ప్రకారం ఆయా భూములు కలిగిన పట్టాదారుల రికార్డుల విచారణతో పూర్తి వివరాలు వెలుగు చూడాల్సి ఉంది.

స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ కూటమిని ఓడిద్దాం

ఎంఐఎం నాయకుడు పిలుపు

నరసరావుపేట: ముస్లిం మైనార్టీలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం కూటమిని ఓడించి ఘోరపరాజయాన్ని బహుమతిగా ఇవ్వాలని ఎంఐఎం పట్టణ అధ్యక్షులు షేక్ మౌలాలి పిలుపు ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. వక్ఫ్ సవరణ చట్టానికి టీడీపీ కూటమి మద్దతు పలకడం నమ్మక ద్రోహమని పేర్కొన్నారు.

పంట ధ్వంసంపై కేసు నమోదు

మార్టూరు: రైతు సాగు చేస్తున్న వ్యవసాయ భూమిలోని పంటను ధ్వంసం చేసిన విషయమై గురువారం రాత్రి మార్టూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏఎస్‌ఐ షేక్ మహబూబ్ బాషా వివరాలు.. గుంటూరులో నివాసం ఉండే పెంటేల సత్యనారాయణ మండలంలోని జంగమహేశ్వరపురంలోని తన భూమిని సాగు చేయిస్తుంటాడు. ఈ క్రమంలో ద్వారకపాడు గ్రామానికి చెందిన కాళహస్తి వాసుదేవ మూర్తి, వలపర్ల గ్రామానికి చెందిన తాళ్లూరి బెన్నయ్య గత బుధవారం ట్రాక్టర్‌తో సత్యనారాయణ భూమిలోని జొన్న పంట ధ్వంసం చేశారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న సత్యన్నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ మహబూబ్ బాషా తెలిపారు.

పసుపు ధరలు

దుగ్గిరాల: గుంటూరు జిల్లా దుగ్గిరాలలోని పసుపు యార్డులో శుక్రవారం 758 బస్తాలు అమ్మకాలు జరిగాయి. సరుకు, కాయలు కనిష్ట ధర రూ.10,000, గరిష్ట ధర రూ.11,000 పలికాయి.

ఇరువర్గాల ఘర్షణపై కేసు

తాడికొండ: బైక్ వ్యక్తిపైకి దూసుకొచ్చిన ఘటనపై ఇరువర్గాలు ఘర్షణకు దిగిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. సీఐ కె.వాసు తెలిపిన వివరాలు.. పొన్నెకల్లులో అద్దెంకమ్మ తల్లి ఆలయం సమీపంలో నివసిస్తున్న మొగిలి రాము ఇంటి నుంచి బయటకు వస్తున్న క్రమంలో అదే కాలనీకి చెందిన ఆవుల మంద వెంకటేష్ బైక్‌ను ర్యాష్‌గా డ్రైవింగ్ చేస్తూ రావడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో ఇరువర్గాలు ఘర్షణకు దిగగా యువకులిద్దరికీ తలపై గాయమైంది. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పొలాల్లో గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం



తాడికొండ: తాడికొండ మండలం బేజాత్‌పురంలోని పంట పొలాల్లో శుక్రవారం గుర్తుతెలియని 70 ఏళ్ల వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది.ఎరుపు రంగు లంగా, లేత బ్లూ రంగు జాకెట్టు, లేత పచ్చరంగు చీర, తల వెంట్రుకలు తెలుపుగా ఉండి చామన చాయ రంగులో ఉంది. ఆచూకీ తెలిసిన వారు తాడికొండ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ తెలిపారు. స్థానిక వీఆర్‌ఓ రవి బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

దామోదరం సంజీవయ్యకు నివాళి



కలెక్టరేట్‌లో సంజీవయ్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ గనోరే

నరసరావుపేట: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెండో ముఖ్యమంత్రిగా, తొలి దళిత సీఎంగా సేవలందించిన దామోదరం సంజీవయ్య 105వ జయంత్యుత్సవం శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. కలెక్టర్ పి.అరుణ్‌బాబు సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్వో ఎ.మురళి, నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల ఆర్డీవోలు మధులత, రమాకాంత్ రెడ్డి, మురళి కృష్ణ పాల్గొన్నారు.



జిల్లా పోలీసు కార్యాలయంలో సంజీవయ్య చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ

సంజీవయ్య చిరస్మరణీయులు

నరసరావుపేట: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండో ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య చిరస్మరణీయుడని ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. సంజీవయ్య జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అదనపు అడ్మిన్ ఎస్పీ జేవీ సంతోష్, ఏఆర్ అదనపు ఎస్పీ సత్తి బాబు, ఏఆర్ డీఎస్పీ మహాత్మా గాంధీరెడ్డి, హోమ్ గార్డు ఆర్ఐ కృష్ణ పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలి

- రోడ్డుభద్రతా మాసోత్సవాల ముగింపు
- 20 మంది ఉత్తమ డ్రైవర్లకు సన్మానం



డ్రైవర్ రాఘవరావుకు సర్టిఫికెట్, పారితోషికం అందజేస్తున్న ఆర్టీసీ, రవాణా, పోలీసు అధికారులు

నరసరావుపేట: ఆర్టీసీ డ్రైవర్లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ శివనాగేశ్వరరావు పేర్కొన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు సందర్భంగా ఆర్టీసీ జిల్లా రవాణా అధికారి ఎస్‌వీ శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం గ్యారేజ్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో శివనాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఆర్టీసీ డ్రైవర్లకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. మరో అతిథి సింధూ స్కూలు అధినేత రామకృష్ణ మాట్లాడుతూ డ్రైవర్ల వల్లే ఆర్టీసీకి మంచి పేరు వచ్చిందని వివరించారు. విధి నిర్వహణలో గుండెపోటు వస్తే వేసుకోవాల్సిన మందులను సింధు విద్యా సంస్థ ద్వారా ఉచితంగా అందిస్తామని హామీ ఇచ్చారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవ్య మాట్లాడుతూ సీపీఆర్ చేసే విధానాన్ని డ్రైవర్లకు వివరించారు. ట్రాఫిక్ సీఐ లోకనాథం మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కల్పించారు. అనంతరం 36 ఏళ్లపాటు పని చేసిన చిలకలూరిపేట డిపో డ్రైవర్ రాఘవరావుతో పాటు మరో 19 మంది ఉత్తమ డ్రైవర్లను సన్మానించారు. సర్టిఫికెట్లు, పారితోషికాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా కార్యాలయ సూపరింటెండెంట్ ప్రసాదు, డ్రైవర్లు, గ్యారేజ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సత్తాచాటిన వేటపాలెం ఎద్దులు

ఆరుపళ్ల విభాగంలో ప్రథమస్థానం కైవసం

మాచవరం: మండల కేంద్రమైన మాచవరంలో శ్రీలక్ష్మితిరుపతమ్మగోపయ్య స్వామి వార్ల కళ్యాణోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు బల ప్రదర్శన పోటీల్లో భాగంగా ఆరుపళ్ల విభాగంలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీషాచౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లు 4000 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. ఏటుకూరి శ్రీనివాసరావు (పెదకూరపాడు), రామినేని రత్తయ్య (తోటపాలెం, చేబ్రోలు మండలం, గుంటూరు జిల్లా) కంబైన్డ్ జత 3773.7 అడుగుల దూరాన్ని లాగి రెండవ స్థానంలో, నలమాద ఉత్తమ్‌పద్మావతి (ఎమ్మెల్యే, కోదాడ, తెలంగాణ) ఎడ్లు 3420.1 అడుగులు దూరాన్ని లాగి మూడవ స్థానంలో, అనంతనేని శ్రీకావ్య, శ్రీమధు (యనమలకుదురు, పెనమలూరు మండలం, కృష్ణాజిల్లా ఎడ్లు 3396.1 అడుగులు దూరాన్ని లాగి నాల్గవ స్థానంలో, మేకా అంజిరెడ్డి (చల్లగుండ్ల, నెకరికల్లు మండలం, పల్నాడు జిల్లా, ఎడ్లు 3023.5 అడుగులు దూరాన్ని లాగి ఐదో స్థానంలో, మన్నెంపల్లి యశస్విని (మాచవరం, పల్నాడు జిల్లా), వసంతతవరపు శ్రీలాస్య, శ్రీమనోజ్ (పిన్నెల్లి, మాచవరం మండలం, పల్నాడు జిల్లా) కంబైన్డ్ జత 2339.5 అడుగులు లాగి ఆరో స్థానంలో, యామని రామారావు (కొత్తపాలెం, మాచవరం మండలం, పల్నాడు జిల్లా) ఎడ్లు 2000 అడుగులు, ముత్తు వెంకటరెడ్డి (గోగులపాడు, గురజాల మండలం, పల్నాడు జిల్లా) ఎడ్లు 528 అడుగులు లాగి ఏడు, ఎనిమిది స్థానాల్లో నిలిచి వరుస బహుమతులు అందుకున్నాయి. శుక్రవారం న్యూ కేటగిరి (సేద్యం విభాగం) లో పోటీలు కొనసాగుతున్నాయి.

పిట్ట కొంచెం.. ‘ఆట’ ఘనం!

- జాతీయస్థాయి ఫుట్‌బాల్‌లో జిల్లా బాలిక ప్రతిభ
- చదువు, ఇతర పోటీల్లోనూ రాణిస్తున్న శ్రీలక్ష్మి
- జిల్లా ఉన్నతాధికారుల నుంచి పలు ప్రశంసాపత్రాలు



బాలల సమస్యలపై సెమినార్‌కు హాజరైన శ్రీలక్ష్మి



ఫుట్‌బాల్ సాధనలో శ్రీలక్ష్మి



జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న శ్రీలక్ష్మి

పెదకాకాని: చదువుతో పాటు క్రీడల్లోనూ శ్రీలక్ష్మి రాణిస్తూ మన్ననలు పొందుతోంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, వ్యాయామ ఉపాధ్యాయుడి శిక్షణతో ఫుట్‌బాల్‌లో రాణిస్తోంది. జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటుతోంది. ఆమె క్రీడా ప్రతిభను గుర్తించిన కేంద్రం గతేడాది స్వాతంత్ర్య దినోత్సవాల్లో పాల్గొనేందుకు ఆహ్వానం కూడా పంపింది.

పెదకాకాని: మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన తాడిబోయిన తాతారావు, శాంతి దంపతుల చిన్న కుమార్తె శ్రీలక్ష్మి ప్రస్తుతం జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. తాతారావు సాంఘిక నాటక రచయిత. శ్రీలక్ష్మి బాగా చదువుతోంది. బాలికలోని క్రీడా ప్రతిభను చూసిన వ్యాయామ ఉపాధ్యాయుడు వినయ్‌కుమార్ 8వ తరగతి నుంచే ఫుట్‌బాల్‌లో శిక్షణ ప్రారంభించారు. దీంతో జాతీయ స్థాయి పోటీల్లో సైతం సత్తా చాటుతోంది. గతేడాది స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్లిన శ్రీలక్ష్మి 13 నుంచి 17వ తేదీ వరకు ప్రోగ్రాంలో పాల్గొంది. క్రాఫ్ట్ సంస్థ నిర్వహించిన పోటీల్లో పాల్గొని ఢిల్లీలో జరిగిన బాలల హక్కులు, బాల కార్మికులు, బాల్యవివాహాలకు సంబంధించిన సెమినార్‌కు ఎంపికైంది. గుంటూరు జిల్లాలో వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జరిగిన డిబేట్‌లో ప్రథమ స్థానం పొందింది. ఓటర్స్ డే సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి నుంచి ప్రశంసాపత్రం అందుకుంది. జిల్లా స్థాయిలో జరిగిన పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపి డీఈఓ సీవీ రేణుక నుంచి సర్టిఫికెట్ అందుకుంది.

ఐఏఎస్ కావడమే లక్ష్యం : శ్రీలక్ష్మి

ఎర్రకోట వద్ద స్వాతంత్ర్య దినోత్సవాల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది. అన్నివిధాలా ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రుల రుణం తీరనిది. ఉపాధ్యాయులను ఎన్నటికీ మర్చిపోను. బాగా చదివి కలెక్టర్ కావాలన్నదే నా లక్ష్యం. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సహకరిస్తున్న దాతలకు ధన్యవాదాలు.

వీఐటీ- ఏపీ వర్సిటీలో అంతర్జాతీయ సదస్సు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

తాడికొండ: వీఐటీ- ఏపీ విశ్వ విద్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న బిజినెస్ ప్రాక్టీసెస్ ఇన్ డిజిటల్ ఎరాపై అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నీతి ఆయోగ్ ఆర్థిక శాస్త్ర సీనియర్ సలహాదారు డాక్టర్ ప్రవాకర్ సాహూ మాట్లాడుతూ 2047 నాటికి రాష్ట్రాన్ని రూ.2.4 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిందని, ప్రభుత్వ దార్శనిక విధానం, స్వర్ణాంధ్రకు భారత ప్రభుత్వం పూర్తి మద్దతు ఇచ్చిందన్నారు. వికసిత్ భారత్ 2047కు ఇది అనుగుణంగా ఉన్న విధానాలను వివరించారు. వీఐటీ ఏపీ వర్సిటీ వీసీ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి మాట్లాడుతూ అనేక అంతర్జాతీయ విశ్వ విద్యాలయాలు, పరిశ్రమలతో చేసుకున్న ఎంఓయూలు తమ వర్సిటీకే తలమానికమన్నారు. తమ వర్సిటీలోని ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా విద్యార్థులలోని యువ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు నిధులను కూడా అందజేస్తున్నామని వివరించారు. గౌరవ అతిథులు న్యూకాలజీ బిజినెస్ స్కూల్, ఆస్ట్రేయా ప్రొఫెసర్ డాక్టర్ ఫ్రాన్సిస్కో పోలూచి, ఎడిన్‌బర్గ్ బిజినెస్ స్కూల్ హెరియట్- వాట్ యూనివర్సిటీ యూకే డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ స్వీనీలు మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ ద్వారా వ్యాపార సామ్రాజ్యం మెరుగు పడుతుందన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, రీసెర్చ్ డీన్ డాక్టర్ రవీంద్ర ధూలి, అసోసియేట్ డీన్ డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ ఎ అస్రార్ అహ్మద్, డాక్టర్ సుహైల్ అహ్మద్,భట్, డాక్టర్ మొహమ్మద్, అబ్దుల్ ముఖీత్ మాజ్ పాల్గొన్నారు.